సాక్షి
తిరుపతి
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



వైభవంగా పవిత్రోత్సవాలు

పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు భాగంగా హోమం నిర్వహించారు. - 8లో



వరద బాధితులకు సాయం

విజయవాడ వరద బాధితులకు తమవంతుగా జిల్లాలోని ఉద్యోగులు వరుసగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. - 8లో



భక్తులు ఓపికతో వేచి ఉండాలి

వరుస సెలవులు, పెరటాసి మాసం రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగిందని, భక్తులు ఓపికతో ఉండాలని ఈఓ కోరారు. - 8లో

న్యూస్‌రీల్

విశ్వకర్మ సేవలు ఆదర్శనీయం



విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో జేసీ శుభం బన్సల్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్

తిరుపతి అర్బన్: విరాట్ విశ్వకర్మ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి చేసిన సేవలు ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్‌తో కలసి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని తెలిపారు. ప్రధానంగా కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప కంచరీ తదితర వృత్తులను సృష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేలా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. విశ్వం మొదటి వాస్తుశిల్పిగా విశ్వసించే విశ్వకర్మను పూజించడం ద్వారా ప్రజలు విశ్వకర్మ జయంతిని జరుపుకుంటారని వివరించారు. విరాట్ విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఫిజికల్ సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జూపార్కు రోడ్డులోని క్యాన్సర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ బీసీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.రేష్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఎమ్మెస్సీ (ఫిజిక్స్), బీఈడీ విద్యార్హత కలిగిన వారు అర్హులని, ఇంగ్లిష్ మీడియంలో బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 21వ తేదీలోపు తమ పాఠశాలలో దరఖాస్తులను అందించాలని, పూర్తి వివరాలకు 90007 83185 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు పోలేరమ్మ జాతరకు రెండో చాటింపు



ముస్తాబైన అమ్మవారి ఆలయం

వెంకటగిరి(సైదాపురం): దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే అమ్మవారి ఆలయం, పోలరమ్మ తల్లి ముఖద్వారం, జాతరకు సంబంధించిన మండపాలు పెయింటింగ్ వేసి ముస్తాబు చేశారు. ఈనెల 11వ తేదీన బుధవారం పోలేరమ్మతల్లి జాతరకు సంబంధించి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా మొదటి చాటింపు నిర్వహించారు. బుధవారం రాత్రి రెండో చాటింపు వేయనున్నారు. 18న ఘటోత్సవం, 25, 26వ తేదీల్లో అమ్మవారి ప్రతిష్ఠ, నగరోత్సవం జరుగుతుంది.

ఎస్‌జీఎఫ్ అండర్-17, 19 ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో అండర్-17, 19 జట్ల ఎంపికకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 కార్యదర్శి ఎస్.జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ బాలుర జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి అండర్-19 టేబుల్ టెన్నిస్, 22న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఉదయం 9.15 గంటల నుంచి అండర్-17, 19 ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అండర్-17 పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే బాలబాలికలు 2008 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు, అండర్-19 0కు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఇంటర్ చదివే బాలబాలికలు 2006 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. వివరాలకు 93936 21004 నంబరులో సంప్రదించాలన్నారు.

పీజీ తరగతులు ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడతలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మంగళవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని, వర్సిటీ నిబంధనల ప్రకారం హాజరు తగ్గితే సెమిస్టర్ పరీక్షలకు అనుమతించమని ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఒక ప్రకటనలో తెలిపారు.

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి



మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించడం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. ప్రైవేటు కళాశాలల అధిక ఫీజులు సామాన్య ప్రజలకు మోయలేని భారం. చాలామంది విద్యార్థులు మెడికల్ కళాశాలలో సీటు వస్తుందని ఆశతో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు. అలాంటి వారికి మేలు చేకూరేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి. అంతేకాని ప్రైవేటుపరం చేయరాదు. ఇప్పటికైనా ప్రభుత్వ మేలుకొని మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే ఆలోచనలను విరమించుకోవాలి. లేదంటే పేద విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుంది. మేలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

– రుక్మాంగద రెడ్డి, విద్యార్థి తండ్రి, నడవలూరు, తిరుపతి జిల్లా



రాజధానిపై శ్రద్ధ.. విద్యార్థుల భవిష్యత్తుపై లేదు



రాష్ట్ర ప్రభుత్వానికి అమరావతిపై ఉన్న ప్రేమ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై లేకుండా పోవడం దారుణం. ఏటా 750 కి పైగా మెడికల్ సీట్లు రాష్ట్రానికి వస్తున్నాయంటే అది మనందరి కీ గర్వ కారణం. ప్రభుత్వం కొంచెం శ్రద్ధ పెడితే కళాశాలలో వసతులు కల్పించడం పెద్దసమస్య కాదు. అక్కడెక్కడో వేలాది కోట్లను ఖర్చుపెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం రాజధాని పేరుతో డ్రామాలు ఆడే కన్నా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వడం ముఖ్యం. మెడికల్ సీట్లు ఎక్కువగా వస్తున్నాయి అన్న ఉద్దేశంతోనే ఖర్చుకు కూడా వెనకాడకుండా మా బిడ్డను నీట్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ చేస్తున్నాం. ఇప్పుడు గాని సీట్లు రాకుండా ఉంటే బిడ్డ భవిష్యత్తు పై ఆందోళనకరంగా ఉంటుంది.

– పద్మావతి, పాడిపేట, తిరుపతి రూరల్ మండలం

కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమంటూ సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు



సర్కారు మెడలు వంచుదాం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోంది. పేద విద్యార్థులు డాక్టర్లు కావాలనే కలలను తుంచేస్తోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసి 17 కళాశాలలను ప్రైవేటు పరం చేసి కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ ఎంబీబీఎస్ విద్యను ఉన్నత వర్గాలకే పరిమితం చేసే కుట్రకు పాల్పడుతోంది. వైద్య విద్యే ప్రైవేటీకరణ, సీట్లలో కోత విధించిన చంద్రబాబు సర్కారును మెడలు వంచేందుకు చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల విద్యార్థి యువజన సంఘాల నేతలు సిద్ధమయ్యారు.

- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థ అస్తవ్యస్తం
- నిరంకుశ పాలనపై కలిసికట్టుగా పోరాడుదాం
- వైద్య విద్య ప్రైవేటీకరణ దారుణం
- డాక్టర్ కావాలన్న పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతున్న పాలకులు
- కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే తిరుగుబాటు తప్పదు
- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలకు విద్యార్థిలోకం సిద్ధం



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటీకరణ మోజులో తరిస్తోంది. కార్పొరేట్ల యావలో పడి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను నిర్మించడంతో పాటు గతేడాది సుమారు 700 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేసింది. అయితే ఈసారి కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు అండ్ కో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడంతో పాటు 700 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయేలా చేసింది. తద్వారా వచ్చే రెండేళ్లలో కూడా వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులు 1400 సీట్లు కోల్పోనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి సీపీఐ కార్యాలయంలో మంగళవారం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారు 15 విద్యార్థి సంఘాలకు చెందిన రాష్ట్రస్థాయి నాయకులు, తిరుపతి, చిత్తూరు జిల్లాల విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు. సమావేశంలో నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసగా ఈనెల 19వ తేదీని తిరుపతి కేంద్రంగా జరిగే ధర్నా, నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నిరంకుశత్వ పాలనను ఎండగట్టి విద్యార్థుల పక్షాన పోరాటాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతారా ?



డాక్టర్ కావాలని ఎన్నో ఆశలతో వ్యయ ప్రయాసలకోర్చి లక్షలు వెచ్చించి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న పేద విద్యార్థి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లడం దారుణం. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వందల సంఖ్యలో ఉచిత సీట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. పులివెందుల కళాశాలలో సుమారు 50 ఫ్రీ సీట్లను ప్రభుత్వం రద్దు చేయడం హేయమైన చర్య.

– మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ప్రభుత్వాన్ని నిలదీద్దాం..



వైద్య విద్యను పేదలకు దూరం చేసే కుట్రలో భాగమే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో సుమారు 12వేలకు పైగా మెడికల్ సీట్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 6,180 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇందులోనూ ప్రభుత్వం కోత విధించడం దారుణం. అన్ని విద్యార్థి సంఘాలు పోరాటాలకు సిద్ధపడదాం.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర అధ్యక్షులు, తిరుపతి

నిరంకుశత్వ పాలనను ఎండగడదాం



చంద్రబాబు కార్పొరేట్ వ్యక్తి. గతంలో సీఎంగా ఆయన ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లిషు మీడియంను వ్యతిరేకించి, కార్పొరేట్ సంస్థలకు అనుమతులు ఇచ్చిన చరిత్ర ఆయనది. డాక్టర్ విద్యను పేదలకు అందని ద్రాక్షలా చేసి బడా బాబులకు దగ్గర చేసే ప్రయత్నంలో భాగమే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ. విద్యార్థి సంఘాల పోరాటాలతో ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటాం.

– ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

విద్యార్థుల జీవితాలతో ఆటలా...!



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుతోంది. నీట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎంబీబీఎస్ సీటు రావడం కష్టమవుతుంది. చంద్రబాబు గతంలో మాదిరే కార్పొరేటర్ల కొమ్ము కాసే విధంగా పాలన సాగిస్తున్నారు.

– మల్లికార్జున, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, తిరుపతి

నాడు వ్యతిరేకించి.. నేడు ప్రైవేటు పాట



చంద్రబాబు గతంలో 107,108 జీఓలను వ్యతిరేకించారు. కూటమి నేతలు సైతం వంత పాడారు. కానీ అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాట అందుకున్నారు. దీంతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలపై ప్రభావం చూపుతుంది. తక్షణం ప్రైవేటీకరణను, మెడికల్ సీట్ల కోతను ఆపాలి. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమం చేయడం ఖాయం.

– ఆశా, పీడీఎస్‌ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

1400 సీట్లు కోల్పోయే ప్రమాదం..



రాష్ట్రప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో సుమారు 1400 ఎంబీబీఎస్ సీట్లు రెండు ఏళ్లలో కోల్పోయే ప్రమాదం ఉంది. ఏపీలో డాక్టర్ల సంఖ్య పెద్దఎత్తున తగ్గుముఖం పట్టి కార్పొరేట్ వైద్యం రాజ్యమేలుతుంది. ఇప్పటికై నా బాబు సర్కార్ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తాం.

– కత్తి రవి, ఏఐవైఎఫ్, జిల్లా కార్యదర్శి

పోరాటాలకు సిద్ధం కండి



రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో పేద విద్యార్థుల ఆశలకు గండి పడుతుంది. పులివెందుల కళాశాలలో 50 సీట్లను ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని సుమారు 140 ఫ్రీ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రతి విద్యార్థి సంఘం అప్రమత్తంగా వ్యవహరించి ప్రభుత్వం దిగొచ్చే వరకూ నిరసనలు కొనసాగిద్దాం.

– అక్బర్, ఎస్ఎఫ్ఐ, జిల్లా అధ్యక్షుడు,తిరుపతి

జీఓలను రద్దు చేయాలి..



విద్యార్థుల కడుపు కొట్టే 107, 108 జీఓలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టే కుట్రను ఆపాలి. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలో సుమారు 3 వేల సీట్ల వరకు భర్తీ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసి పేదల కడుపు కొడుతోంది. – చలపతి, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, తిరుపతి

పేదల కడుపు కొడితే యుద్ధమే



రాష్ట్రంలో ఎంతోమంది విద్యార్థుల జీవిత ఆశయం డాక్టర్ కావడం. అలాంటి ఆశలపై నీళ్ల చల్లి మెడికల్ సీట్లను అమ్ముకునే విధంగా చంద్రబాబు సర్కారు అడుగులు వేస్తోంది. ఈ ఏడాది సుమారు 700 ఫ్రీ సీట్లు కోల్పోతున్నాం. అంటే 700 భవిష్యత్ డాక్టర్లను ఏపీ కోల్పోతోంది.

– జయచంద్ర, డీవైఎఫ్ఐ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతి

ముక్కంటికి పవిత్రాల సమర్పణ



స్వామివారికి పవిత్రాలు సమర్పిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ మూలవిరాట్‌లకు పవిత్రమాలధారణతో విశేష పూజా కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. యాగశాల నుంచి పవిత్రమాలలు, విశేష పూజాద్రవ్యాలను శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి తొలుత రంగుల గోపురం వద్ద ఉన్న వినాయకుడికి, ఆలయంలో ఉన్న పరివార దేవతలకు సమర్పించారు. అనంతరం వినాయకుడు, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి కూడా పవిత్రమాలల సమర్పణ అత్యంత వేడుకగా జరిగింది. యాగశాలలో విశిష్ట పూజాద్రవ్యాలతో శాంతిహోమం పూజలు, చండికేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు

పెంచలకోనకు భారీ ఆదాయం

రాపూరు: పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కించగా భారీ ఆదాయం వచ్చిందని డీసీ విజయసాగర్ బాబు తెలిపారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో మంగళవారం కానుకలు లెక్కించగా 90 రోజులకు గానూ ఒక కోటి 22 లక్షల 52 వేల342 రూపాయలు, బంగారం 375 గ్రాములు, వెండి 5.6 కేజీలు వచ్చినట్లు చెప్పారు. అన్నదాన సత్రం హుండీ ద్వారా రూ.5.89 లక్షలు, విదేశీ నాణేలు వచ్చినట్లు తెలిపారు. జిల్లా దేవదాయశాఖ ఏసీ శ్రీనివాసరావు, ఈఓ శ్రీనివాసులు, సిబ్బంది, బ్యాంకు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీగా ఎర్రమట్టి తరలింపు

- అనుమతులు లేకుండానే తరలిస్తున్న అధికార పార్టీ నేత
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



ట్రాక్టర్‌లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

నాగలాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ పార్టీల నేతలు అక్రమాలకు ఒడిగట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రకృతి సంపదను కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. నాగలాపురం మండలంలోని టీపీ పాళెం గ్రామం చెరువులో నుంచి ఎర్రమట్టిని తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు ట్రాక్టర్ల ద్వారా అడ్డగోలుగా తరలిస్తున్నాడు. కనీస అనుమతులు కూడా లేవు. ఎర్రమట్టి తరలింపు గురించి టీపీ పాళెం వీఆర్వో వెంకటరమణయ్యను వివరణ కోరగా తమ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదని తెలిపారు. టి.పి.పాళెం చెరువులో నుంచి అధికార పార్టీ నేత యథేచ్ఛగా తన సొంత పొలంలోకి ఎర్రమట్టిని తోలుకొంటున్నాడు. అనుమతులు లేకపోయినా.. అధికారంలో ఉన్నది తమ ప్రభుత్వమే కదా ఎవరు అడుగుతారనే ధీమాతో దాదాపు 50 ట్రాక్టర్ల ఎర్రమట్టిని పొలానికి తరలించాడు. ఇది అక్రమ రవాణా అని తెలిసినా కూడా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎర్రమట్టి అక్రమ రవాణాపై జిల్లాస్థాయి అధికారులు అయినా స్పందిస్తారో ? లేదో అని ఎదురు చూస్తున్నారు.

వీఆర్వోలకు బెయిలబుల్ వారెంట్

తిరుపతి లీగల్ : ఓ హత్య కేసులో సాక్షులుగా ఉన్న ఇద్దరు వీఆర్వోలు సాక్షి సమన్లు తీసుకుని కోర్టుకు హాజరు కాకపోవడంతో వారెంట్ జారీ చేస్తూ హాజరు పరచాలని తిరుపతి పదో అదనపు జిల్లాజడ్జి రామచంద్రుడు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. నారాయణవనం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసు కోర్టులో విచారణ జరుగుతోంది. రేణిగుంట మండలం తాండ్లం గ్రామానికి చెందిన డి.రామ్మూర్తి, నారాయణవనం మండలం తుంబూరు వీఆర్వోగా, చిత్తూరు జిల్లా నాగలాపురం మండలం కలంజేరికి చెందిన ఎం.పళణి నారాయణవనం మండలం ఇరికింబట్టు వీఆర్ఓగా హత్య జరిగిన సమయంలో విధులు నిర్వహించేవారు. పోలీసులు ఇద్దరు వీఆర్వోలను చార్జ్‌షీట్‌లో సాక్షులుగా పేర్కొన్నారు. దీంతో కోర్టు ఇద్దరి వీఆర్వోలకు కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పాల్సిందిగా ఇదివరలో సమన్లు జారీ చేసింది. అయితే ఇద్దరు వీఆర్వోలు కోర్టుకు హాజరు కాకపోవడంతో వారిని బెయిలబుల్ వారెంట్‌పై హాజరు పరచాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయం చేయాలి



విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటుచేసింది. అందులో కొన్ని ఈ ఏడాది అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ కళాశాలల్లో అడ్మిషన్లు చేపట్టకూడదని జాతీయ మెడికల్ కౌన్సిల్ కు ప్రస్తుత కూటమి ప్రభుత్వం లేఖ రాయడం బాధాకరం. దీంతో ఎంతో మంది మెరిట్ విద్యార్థులు సీటు రాక ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచించి వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులకు న్యాయం చేయాలి. లేదంటే వైద్యవిద్య చదవాలనుకున్న మా ఆశలు అడియాశలు అవుతాయి.

– కె.దినేష్, నీట్ విద్యార్థి, తిరుపతి



కొత్త కళాశాలలతోనే అవకాశం



కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటుతోనే మరిన్ని సీట్లు అందుబాటులోకి వస్తాయి. తద్వారా మెరిట్ విద్యార్థులకు అవకాశాలు లభిస్తాయి. నూతన వైద్య కళాశాలలు ఏర్పాటైనప్పటికీ సీట్లు లేకపోవడంతో ప్రస్తుతం మెరిట్ సాధించిన విద్యార్థులు అవకాశాలను కోల్పోయారు. దీంతో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో వైద్య విద్య అభ్యసించాల్సి వస్తోంది. అయితే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అంత ఫీజులు కట్టి ప్రైవేటు కళాశాలల్లో చదవలేము. దీంతో మెరిట్ ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారు. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించి మాలాంటి విద్యార్థులకు న్యాయం చేయాలి.

– పి.సాయిధన్విత, నీట్ విద్యార్థిని, తిరుపతి

భక్తులు ఓపికతో వేచి ఉండాలి



కూరగాయల దాతలతో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామల రావు

తిరుమల: స్వామివారి దర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేని భక్తులకు దాదాపు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని, దర్శనం కోసం వచ్చిన భక్తులు ఓపికతో ఉండాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అన్నారు. మంగళవారం ఆయన తిరుమలలోని సీఆర్‌ఓ జనరల్, నారాయణగిరి షెడ్లు, క్యూలైన్లను అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా వరుస సెలవులు, పెరటాసి మాసం రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగిందన్నారు. అంతకుముందు వారు నారాయణగిరి షెడ్లు, క్యూలైన్ల వద్ద అన్నప్రసాదాలు, పాలు, తాగునీటి పంపిణీని పరిశీలించారు. సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓలు భాస్కర్, హరీంద్రనాథ్, వీఎస్‌ఓ సురేంద్ర పాల్గొన్నారు.

కూరగాయల దాతలకు సన్మానం

గత రెండు దశాబ్దాలుగా టీటీడీ అన్నప్రసాదానికి కూరగాయలు పంపుతున్న దాతల సహకారం మరువలేనిదని అదనపు ఈఓ వెంకయ్య చౌదరి కొనియాడారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం సాయంత్రం టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో కూరగాయల దాతలతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక క్యాటరింగ్ అధికారి జీఎల్ఎన్ శాస్త్రి 2004లో ప్రారంభించిన కూరగాయల విరాళం గత 20 ఏళ్లలో సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం 24 మంది కూరగాయల దాతలను అదనపు ఈఓ ఘనంగా సన్మానించారు.

భక్తులకు నాణ్యమైన ఆహారం అందించండి

తిరుమలలోని హోటళ్ల వ్యాపారులు భక్తులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఈఓ శ్యామలరావు తెలిపారు. ఆస్థాన మండపంలో టీటీడీ ఆరోగ్య, ఎస్టేట్స్ విభాగాల ఆహార భద్రత విభాగం వారి కలసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈఓ ప్రసంగించారు. అంతకుముందు ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ పూర్ణచంద్రరావు తిరుమలలోని రెస్టారెంట్లు, తినుబండారాల యజమానులు పాటించాల్సిన పారిశుద్ధ్యం, చట్టాల గురించి వివరించారు.

అభివృద్ధిలో పోటీ పడదాం

- రాజకీయం ఎన్నికల్లో చూసుకుందాం
- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి హితవు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

చౌడేపల్లి: మన ప్రాంతాల అభివృద్ధిలో గత ప్రభుత్వం చేసిన దానికంటే ఎక్కువ చేసేందుకు పోటీ పడాలని, రాజకీయం ఎన్నికల సమయంలో మాత్రమే చూసుకోవాలని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి టీడీపీ నాయకులకు హితవు పలికారు. మంగళవారం చౌడేపల్లె పర్యటనకు వచ్చిన ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే విధంగా కర్ణాటక సరిహద్దు నుంచి చౌడేపల్లె మీదుగా రొంపిచెర్ల క్రాస్ వయా తిరుపతికి నేషనల్ హైవే కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి గతంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిపాదన లేఖను అందజేశామన్నారు. ఈ ప్రాజెక్టు మంజూరుకు పార్లమెంటులో ప్రస్తావించి కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలు పక్కన పెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని, రాజకీయ కక్షలతో దాడులు, కక్ష సాధింపులకు స్వస్తి పలకాలని టీడీపీ నాయకులను కోరారు. మండలంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో బోయకొండ ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయడంతో పాటు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి రోడ్డు, ఆలయాభివృద్ధికి కృషి చేశామన్నారు. "టీడీపీ నాయకులకు చెప్పేది ఒక్కటే..అభివృద్ధిలో మాకంటే మీరు బ్రహ్మాండంగా చేయండి.. మా సహకారం ఎప్పుడూ ఉంటుంది.. చంద్రబాబుతో మీరు మాట్లాడండి. అమరావతి రోడ్లే కాదు కర్ణాటక సరిహద్దు నుంచి పుంగనూ రు మీదుగా రొంపిచెర్ల క్రాస్‌కు అనుసంధానం అయ్యేలా నేషనల్ హైవే ప్రాజెక్టు మంజూరుకు ఒత్తిడి తెండి'' అని కోరారు. వాటర్ గ్రిడ్ పనులకు పూనుకుని పూర్తిచేస్తే తాగునీటి సమస్య తీరుతుందని, దీనికి గత ప్రభుత్వం అప్పట్లోనే 50 శాతం మేరకు నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ప్రజలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు సుధాకర్ రెడ్డి, నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, రెడ్డిప్రకాష్, నాయకులు మిద్దింటి కిషోర్‌బాబు, శ్రీని వాసులురెడ్డి, పద్మనాభరెడ్డి,నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డున పడుతున్నాం సార్..



మైనింగ్ కార్యాలయం ఎదుట సిలికా డీలర్ల ఆందోళన

చిల్లకూరు: సిలికా, క్వార్ట్జ్ మైనింగ్‌లపై మూడు నెలలుగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అప్పుల పాలవుతున్నామని ఎండీఎల్ డీలర్లు చిల్లకూరులోని మైనింగ్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం సిలికాన్‌ను ఓ సంస్థకు అప్పగించడంతో వారి వద్ద నుంచి డీలర్లుగా ఉన్న తాము కొనుగోలు చేసుకుని పలు పరిశ్రమలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఎన్నికల సమయంలో సిలికా తరలింపులను నిలిపి వేయడంతో అటు రెండు నెలలు, ఎన్నికల అనంతరం మూడు నెలలు మొత్తం ఐదు నెలల పాటు సిలికా విక్రయాలు లేకపోవడంతో ఇటు తాము, అటు పరిశ్రమల్లో పని చేసే కూలీలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం మైనింగ్ విషయంలో ఒక నిర్ణయం తీసుకుని తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం వారు మైనింగ్ కార్యాలయంలో ఏడీ రంగకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. చంద్రశేఖర్, మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మ విరిగిపడి ఆర్టీసీ డ్రైవర్ మృతి

కోవూరు: చెట్టుకొమ్మ విరిగి తలపైన పడడంతో ఆర్టీసీ డ్రైవర్ మృతిచెందిన సంఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పడుగుపాడు ఆర్టీసీ వర్క్ షాప్ దగ్గర మంగళవారం జరిగింది. వివరాలు.. తిరుపతి జిల్లా నారాయణవనం మండలం కృష్ణంరాజుకండ్రిగలో నివాసం ఉంటున్న శ్రీరాములు పుత్తూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బస్సుకు అద్దం పగలడంతో రిపేరీకి వర్క్‌షాప్‌కు వచ్చాడు. కాస్త సమయం ఉండడంతో వర్క్ షాప్ బయట చెట్టు కింద పడుకున్నాడు. ఆ సమయంలో చెట్టు కొమ్మ విరిగి శ్రీరాములు తలపై పడడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భారతి సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



తాపీమేస్త్రీలకు ప్రమాదబీమా పత్రాలను అందిస్తున్న ఛాయాపతి

రాపూరు: భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ నాణ్యమైందని, నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందని సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి తెలిపారు. భారతి సిమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం రాపూరు మండలం తూమాయి రోడ్డులో శ్రీలక్ష్మీ సాయి సిమెంట్ అండ్ హార్డ్‌వేర్ కేంద్రంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ అత్యాధునిక టెక్నాలజీతో తయారైందన్నారు. ముఖ్యంగా స్లాబ్‌లు, సిమెంట్‌పైపులు, ఇటుకుల తయారీకి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ సరైందని తెలిపారు. భారతి సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌ల కన్నా భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ధర రూ.20 మాత్రమే అధికమన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువ చేసే ప్రమాదబీమా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్ మణికుమార్, డీలర్ సుధాకర్, తాపీ మేస్త్రీలు, వినియోగదారులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి, వైద్యాధికారులు

తిరుపతి తుడా: రుయాకు వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. రుయా అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తొలిసారిగా నిర్వహించిన సమావేశంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వర్కింగ్ కమిటీ మెంబర్ బండ్ల లక్ష్మీపతి రాయల్, ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా, మెటర్నిటీ ఆస్పత్రుల వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుయా హాస్పిటల్ సూపరింటెండెంటు రవిప్రభు రుయాభివృద్ధి కమిటీ కన్వీనర్ హోదాలో అజెండా అంశాలను నివేదించారు. కమిటీలో మునుపటి సమావేశం మినిట్స్, ఆమోదించబడిన తీర్మానాలపై సమావేశంలో చర్చించారు. అందులో ఆక్సిజన్ పైపులైన్ల నిర్వహణకు ఒకనెలలోపు టెండర్లు పిలిచి ప్రక్రియ పూర్తి చేయాలని ఏపీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. తదుపరి సమావేశం సెప్టెంబర్ 27న నిర్వహించాలని, అప్పుడు అన్ని విభాగాల ప్రధాన విభాగాధిపతులు, ఇతరత్రా విభాగాల ప్రతినిధులు రావాలని నిర్ణయించారు. సమావేశంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, మెటర్నిటీ సూపరింటెండెంటు డాక్టర్ పార్థసారథి రెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరామి రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

310 మొబైల్ ఫోన్ల రికవరీ


- ఇప్పటివరకు 3,530 ఫోన్లను బాధితులకు అందించాం
- తాజాగా రూ.62 లక్షలు విలువ చేసే మొబైల్స్ రికవరీ చేశాం
- ఎస్పీ సుబ్బరాయుడు



మొబైల్‌ను బాధితులకు అందిస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైమ్: జిల్లావ్యాప్తంగా పోగొట్టుకున్న 310 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా పరిధిలో పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ హంట్(పోలీస్ వాట్సాప్ నంబర్ 9490617873) అప్లికేషన్ సేవల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు పది విడతల్లో రూ.6.7 కోట్లు విలువ చేసే 3,530 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తాజాగా 11వ విడతలో రూ.62 లక్షల విలువ చేసే 310 సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేశారన్నారు. లక్షలాదిమంది భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చి మొబైళ్లను పోగొట్టుకుంటున్నారని, అదేవిధంగా కొన్ని చోరీకి గురవుతున్నాయని తెలిపారు. అలాంటి వారంతా పోలీస్ వాట్సాప్ నంబర్ 9490617873 ద్వారా సీఈఐఆర్‌కు ఫిర్యాదు చేస్తున్నారని, అందులో ఉన్న వివరాల ఆధారంగా ఫోన్లను రికవరీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు రికవరీ చేసిన ఫోన్లన్నీ ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి తీసుకొచ్చామన్నారు. మొబైల్ దుకాణాల వారు అజ్ఞాత వ్యక్తుల వద్ద సెకండ్ హ్యాండ్‌లో ఫోన్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. అనంతరం ఆయన సైబర్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఫోన్ల రికవరీలో ఏఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, సైబర్ సీఐ వినోద్ కుమార్, సిబ్బంది కృషి ఉందన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓలు

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై జిల్లాస్థాయి అధికారుల బృందం విచారణ చేపట్టారు. గత ఎనిమిదేళ్లుగా ప్రస్తుత, గతంలో పని చేసిన మాజీ సర్పంచులు భారీగా అవినీతికి పాల్పడినట్లు ఇందిరానగర్‌కు చెందిన ఆడిపూడి ఆశ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన విచారణ చేపట్టాలని ఆదేశించారు. శ్రీకాళహస్తి డీఎల్‌పీఓ ప్రభు రెడ్డి, సూళ్లూరుపేట డీఎల్‌పీఓ రవీంద్రబాబు మంగళవారం ఇందిరానగర్‌లో ఫిర్యాదుదారాలు ఆశ సమక్షంలో ప్రస్తుత సర్పంచ్ వీరభద్రం, మాజీ సర్పంచ్ రసూల్ సాహెబ్, అదే పంచాయతీలో గతంలో కార్యదర్శిగా పనిచేసిన చిట్టిబాబు, మరికొందరిని విచారించారు. రికార్డులను వారు స్వాధీనం చేసుకుని 15రోజుల్లోపు పూర్తిస్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



శేషవాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి వాసుదేవ కుండ హోమాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి అలంకార మండపంలో ఉదయం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలు, పవిత్రాలను అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ దేవస్థానంలో తెలిసీ తెలియక జరిగే దోష నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

శ్రీవారికి క్షేత్రోత్సవం..

పెంచలకోనలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లను వివిధ పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై కొలువుదీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

వరద బాధితులకు ఉద్యోగుల సాయం

తిరుపతి అర్బన్: విజయవాడ వరద బాధితులకు ఉద్యోగుల సాయం కొనసాగుతోంది. మంగళవారం తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య నేతృత్వంలో అధికారులు, ఉద్యోగుల నుంచి వసూలు చేసిన రూ.4,90,000 నగదును చెక్కు రూపంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు. అదేవిధంగా కోట మండలం మహాలక్ష్మి హ్యాచరీస్(ఆక్వా) యజమాని సాగర్ రెడ్డి, వాకాడు మండలానికి సంబంధించి ఆంజనేయ మెరైన్ హ్యాచరీస్ (ఆక్వా) యజమాని జితేష్, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు రూ.లక్ష చొప్పున చెక్కులను కలెక్టర్‌కు వేర్వేరుగా అందించారు.

గొడవ చేస్తున్నాడని.. చిన్నారిని చంపేశారా ?

- తుమ్మలగుంటలో నాలుగేళ్ల బాబు అనుమానాస్పద మృతి



మృతి చెందిన మనోజ్ మెడ చుట్టూ కమిలిపోయి ఉన్న దృశ్యం

తిరుపతి రూరల్: హోటల్ నుంచి భోజనం తీసుకొచ్చేందుకు వెళ్తూ తన నాలుగేళ్ల కొడుకును పక్కింటి 11 ఏళ్ల పాప వద్ద వదిలి వెళ్లిన తల్లికి కడుపుకోత మిగిలింది. ఆమె తిరిగి వచ్చేలోపు గొంతు చుట్టూ వాతలతో బాబు శవమై కనిపించడంతో తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెంచువారి కాలనీకి చెందిన రాయలమ్మ సోమవారం భోజనం తీసుకొచ్చేందుకు హోటల్‌కు వెళ్తూ తన కుమారుడు మనోజ్ (4)ను పక్కింటిలో నివసించే 11 ఏళ్ల చిన్నారి వద్ద వదిలివెళ్లింది. అయితే హోటల్ నుంచి భోజనం తీసుకుని తిరిగి ఇంటికి వస్తుండగానే.. ఆ పాప, ఆమె అవ్వ మనోజ్‌ను భుజంపై వేసుకుని ఎదురుగా వచ్చారు. మనోజ్ అచేతనంగా పడి ఉండడంతో ఆందోళనతో రాయలమ్మ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అయితే అప్పటికే మనోజ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో కన్నీరు మున్నీరు అయింది. అల్లరి చేస్తున్నాడని కోపంతో మనోజ్ మెడకు తాడు బిగించినట్లు మృతుడి తల్లి అనుమానిస్తుంది. రాయలమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

96 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, వాహనాలను చూపుతున్న సీఐ బాబీ, అధికారులు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, రెండు వాహనాలను పట్టుకున్నట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబీ వెల్లడించారు. పట్టణంలోని సివిల్ సప్లై గోదాం వద్ద సీఐ విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సారథ్యంలో సిబ్బందితో కలిసి శ్రీనివాసపురం గ్రామ సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేపట్టామని సీఐ తెలిపారు. నాయుడుపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని బస్తాల్లో నింపి లారీ, బొలేరో వాహనాల్లో లోడ్ చేసుకుని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. లారీతో పాటు బొలేరోలో 50 కేజీల బియ్యం బస్తాలు మొత్తం 95 ఉన్నాయని తెలిపారు. వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు అయిన చిత్తూరు జిల్లా వీకోట మండలానికి చెందిన పఠాన్ బషీర్, అష్రాఫ్, దొరవారిసత్రం మండలం గొల్లపాళెంకు చెందిన షేక్ సద్దాం హుస్సేన్‌ను అరెస్టు చేసి, పట్టుబడిన రేషన్ బియ్యాన్ని స్థానిక సివిల్ సప్లై డీటీ ఓబయ్యకు అప్పగించి, వాహనాలను సీజ్ చేశామని సీఐ తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రిజిడ్-కెనిసియో ట్యాపింగ్ వర్క్‌షాప్

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ కాలేజీలో వర్క్‌షాప్ నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్.వి. కుమార్ డా.మయాంక్ పుష్కర్ ఫిజియోథెరపీ కాలేజ్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ డా.కె.మాధవి పాల్గొని జ్యోతి వెలిగించి వర్క్‌షాప్ ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు డా.ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ స్విమ్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అనువైన విధంగా వారి సంబంధిత వృత్తుల్లో ప్రత్యేక నైపుణ్యాలను అందించడానికి ఓపెన్ ఆప్షన్లు, విస్తృత అవకాశాలను ఎంపిక చేసుకోవడానికి విద్యార్థులకు సహాయ పడతాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొ.డా.సి.శాంతి, నెల్లూరు, స్వాతి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డా.హరిబాబు పాల్గొన్నారు.